క్లుప్తంగా

శాస్త్రీయ పద్ధతుల సాగుతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

చింతపల్లి: గిరిజన రైతాంగం వరి సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు అన్నారు. బెన్నవరం పంచాయతీ పరిధిలోని పోతురాజుగున్నలు గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకం కార్యక్రమాని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా గిరిజన రైతులకు వరి వంగడాలను సబ్సిడీపై ఎపంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వరి పంటను వరుసలలో నాట్లు వేయడం, కాలిబాటలు తీయడం, సూడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేయడం, సకాలంలో కలుపుతీత వంటి శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు సాధించివచ్చన్నారు. ఈ మేరకు పంట కోత ప్రయోగాలతో నిరూపితమైనట్టు తెలిపారు. గిరి రైతులు అధికారులు సూచనలను పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు.

ఆదివాసీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న సంఘం నాయకులు

రంపచోడవరం: రంపచోడవరంలో ఆదివాసీ (గిరిజన) సంక్షేమ ,సాంస్కృతిక సంఘం నూతన భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. సంఘం నూతన అధ్యక్షుడు కత్తుల ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శంకుస్థాపన పూజలను ఓఎన్‌జీసీ రిటైర్డ్ డైరెక్టర్ పి.కామరాజు దంపతులు నిర్వహించారు. నాయకులు పకీర్‌దొర, కాటం రెడ్డి, బొజ్జిరెడ్డి, కృష్ణ, అప్పలరాజు, సత్యనారాయణ, గంగరాజు, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఆదివాసీలకు అందుబాటులో తీసుకొస్తామన్నారు.

నిరాహార దీక్ష అనుమతి కోసం వినతి



పోలీసులకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న వలంటీర్లు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో గ్రామ వలంటీర్లు ఈనెల 28న చేపట్టనున్న రిలే నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్థానిక పోలీసు స్టేషన్‌లో సిబ్బందికి అనుమతి పత్రాన్ని అందజేసినట్టు మండల వలంటీర్ల సంఘం అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియమించబడిన వలంటీర్లకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం విధులోకి తీసుకోకపోవడంతో కుటుంబాలతో రోడ్డున పడ్డామని, దీంతో రిలే నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధమైనట్టు చెప్పారు. వలంటీర్లు కామరాజు, నాగేశ్వరరావు, కళ్యాణ్ తదితరలు పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

జి.మాడుగుల: బీజేపీ మండల కార్యవర్గ ఎన్నిక మండల కేంద్రంలో గురువారం ట్రైకార్ బోర్డు డైరెక్టర్ కృష్ణారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, బిజెపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక అధ్వర్యంలో జరిగింది. మండల అధ్యక్షుడిగా రీమెలి కళ్యాణం, ప్రధాన కార్యదర్శిగా కోరాబు శ్రీనివాస్(మహేష్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు కళ్యాణంను నాయకులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. సింహాచలం, సుబ్బారావు, చిరంజీవి, సత్యారావు, చంటి, పరమేశ్వర్, పార్వతమ్మ, ఝాన్సీ తదితరలు పాల్గొన్నారు.

రహదారిద్య్రం

- అర్థాంతరంగా పనులు
- చినుకు పడితే చిత్తడే
- రవాణా సౌకర్యం లేక గిరిజనుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



చాపరాయి- పెద్దపాడు మట్టిరోడ్డు



కంద్రూమ్- స్వర్ణాయిగుడ రహదారి దుస్థితి

దుంబ్రిగుడ: మండలంలోని పలు గిరిజన గ్రామాలకు కలిపే కనెక్టివిటీ రోడ్లకు మోక్షం లభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం పడిన మట్టి రోడ్డు చిత్తడిగా మారి రవాణాకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మన్యంలోని అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన్య ప్రాంతంలో ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా రహదారుల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగింది.గ్రామాలకు రహదారులు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం మంజూరు చేసిన నిధులు ఎన్నికల కోడ్ వల్ల పనులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మన్యంలో ఒక్క రహదారి పని కూడా చేపట్టలేదు. మచ్చుకైనా ఒక్క అభివృద్ధి పని చేయలేదు. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తారురోడ్డు నిర్మించాలి



గ్రామంలో రోడ్డు వర్షాలకు కోట్టుకుపోయింది. అధికారులు స్పందించి తారురోడ్డు నిర్మించాలి. చాపరాయి నుంచి నిర్మిస్తే డుంబ్రిగుడ, అరకులోయ ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– పాంగి రాంబాబు, పెద్దపాడు, డుంబ్రిగుడ మండలం

కలెక్టర్ దృష్టికి సమస్యలు



మండలంలోని రోడ్డు సౌకర్యలు లేని గ్రామాల జాబితా ట్రైబల్ వెల్ఫేర్ ఏఈతో రూపొందించి కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టిలో తీసుకు వెళ్లెందుకు సిద్ధం చేస్తున్నం. గ్రామంట్స్ వస్తే తప్పకుండా గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పిస్తాం.

– ప్రేమ్‌సాగర్ ఎంపీడీవో, డుంబ్రిగుడ మండలం

గ్రామాల్లో పనులు

మండలంలోని పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో డబ్యూబీఎం మెటల్ రోడ్ల పనులు పలుచోట్ల జరుగుతున్నాయి. సొవ్వా పంచాయతీ సాగిరి వలసలో రెండ్లు బిట్‌లు కింద రూ.80 లక్షలతో, రంగిలిసింగి పంచాయతీ కుజభంగి నుంచి ముసర్‌లంక వరకు పనులు జరుగుతున్నాయి.

– అజయ్, పంచాయతీ రాజ్ ఏఈ, డుంబ్రిగుడ మండలం

గోతుల దారులు



గోతులతో ఉన్న పనసపుట్టు- కుకుడబెడ్డ రహదారి

మండలంలోని కంద్రుమ్ పంచాయతీ స్వర్ణాయిగుడ, పనసపుట్టు, కుకుడబెడ్డ గ్రామాలకు వెళ్లే సుమారు నాలుగు కిలో మీటర్ల మట్టిరోడ్డులో గ్రావెల్ వేసి వదిలేశారు. ఈ రోడ్డులో బీటీ రోడ్డు నిర్మించాలని దీంతో ఆరు గ్రామల గిరిజనులకు ఉపయోగకరంగా **ఉంటుందని గిరిజనలు కోరుతున్నారు.** సాగర **పంచాయతీ మీదుగా సొవ్వా వెళ్లే రోడ్డు మార్గంలో బలియగుడ జంక్షన్ నుంచి గద్యగుడ, పోర్డగుడ గ్రామాల్లో ఉన్న రోడ్డు పూర్తిగా రాళ్లు బయటకు తేలి ద్విచక్రవాహనం వెళ్లెందుకు** వీలు **లేకుండా ఉంది. ఈ రోడ్డు నిర్మాణం చేస్తే** గిరిజనులు పండించే వ్యవసాయ, అటవీ పంటలు వారపు సంతలో తరలించేందుకు వీలవుతుందని గిరిజనులు కోరుతున్నారు. కొల్లాపుట్ల పంచాయితీ బూసిపుట్టు నుంచి నందివలస, బిత్రగండ, బలియగుడ, మున్నిగుడ గ్రామాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న గ్రావెల్ రోడ్డులో బీటీ రోడ్డుగా నిర్మించాలని ఆయా పరిధిలో ఉన్న సుమారు అయిదు గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు కోరుతున్నారు.

రాళ్లు తేలిన రహదారులు



రాళ్లు తేలి ఉన్న బలిగడ్డ-గద్యగుడ రోడ్డు

మండల కేంద్రానికి సమీప దూరంలో ఉన్న పోతంగి పంచాయతీ చాపరాయిలో వంతెన నిర్మించి అక్కడ నుంచి మూడు కిలోమీటర్లు బీటి రోడ్డు నిర్మించి పెద్దపాడు, కొసంగి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే బుడియవలస, తెంగడవలస, వర్ర, మీదుగా అరకులోయ మండల కేంద్రానికి అలాగే మాడగడ వ్యూ పాయింట్, సుంకరమెట, ఎస్.కోట, విశాఖపట్నం చేరుకోవచ్చు. దీంతో పర్యాటకులకు రోడ్డు సౌకర్యంతో పాటు దూరభారం తగ్గుతుంది. పెద్దపాడు రోడ్డు గతంలో రెండుసార్లు గ్రావెల్ వేసి వదిలేశారు. కొర్ర పంచాయతీ బల్యగుడ, శెట్టిబంద గ్రామాలకు పూర్తి మంటి రోడ్డు ఉండటంతో గిరిజనల అవస్థలు అంతింత కాదు. డుంబ్రిగుడ నుంచి గుంటసీమకు వెళ్లె రోడ్డు మార్గంలో కంద్రుమ్, సర్రాయి మీదుగా అంతర్‌రాష్ట్ర చటువా రోడ్డుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ 6.50 కోట్లతో వంతెన నిర్మాణం చేశారు. అయితే అయితే ఒక కిలో మీటరు అప్రోచ్‌రోడ్డు నిర్మాణ పనులు చేసే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. గతంలో ఉన్న మట్టిరోడ్లు ఇటీవల వర్షాలు కురుస్తున్న కారణంగా రోడ్లు కొట్టుకుపోవడంతో కొంత కోతకు గురైందని ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లలేని పరిస్థితి ఉందని అధికారులు స్పందించి మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

‘వైఎస్సార్‌సీపీ పోరుబాట’ను విజయవంతం చేయాలి

డుంబ్రిగుడ: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో శుక్రవారం అరకులోయలో చేపడుతున్న వైఎస్సార్‌సీపీ పోరుబాటు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్.మల్లేశ్వర రావు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జి.మాడుగుల: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం చేపట్టనున్న వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండంనాయుడు తెలిపారు. పాడేరులో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ఉదయం 10గంటలకు ర్యాలీ సాగుతుందన్నారు. విద్యుత్ చార్జీల తగ్గింపుపై అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గృహసారధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కన్వీనర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

చింతపల్లి: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం చేపట్టనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ పిలుపునిచ్చారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలి, పన్నులు, అధిక ధరల రూపంలో ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. విద్యుత్ చార్జీలను పెంచమని ఎన్నికల్లో హామి ఇచ్చి మాట తప్పి వినియోగదారులపై బాదుడే బాదుడే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పార్టీ పిలుపు మేరకు పాడేరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి తలపెట్టిన ర్యాలీ కార్యక్రమానికి మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్

ఆదివాసీ హక్కులపై పోరాటానికి పిలుపు



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాబు, సురేంద్ర

అరకులోయటౌన్: జీవో నంబర్–3 అమలు, స్పెషల్ డీఎస్సీ సాధనకై సిద్ధం కావాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లోతారం బాబు, కిల్లో సురేంద్ర గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కుల సాధన కోసం పోరాటం చేసే వారిని పీసా కమిటీలో ఎన్నుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించి షెడ్యూల్ ప్రాంతంలో గ్రామ సభల హక్కులను హరించి, ఆదివాసీలకు అటవీ నుంచి దూరం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు పైబడినా జీఓ నెంబర్ 3, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు అతీగతీ లేదన్నారు. 1/70 అటవీ హక్కుల చట్టాలను ఏజెన్సీలో అమలు చేయకుండా గిరిజనేతరులకు వందలాది ఎకరాల భూములను దారాదత్తం చేయడం వలన బినామీల పేర్లతో లాడ్జీలు, రిసార్ట్స్‌ల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం ప్రొత్సహిస్తుందన్నారు. భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించి కోట్లాది రూపాయలతో హైవే పనులు నిర్మించి, వందలాది ఎకరాల భూములను గిరిజనులకు దూరం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరిట 2.50 లక్షల మంది ఆదివాసీ గిరిజనుల జీవితాలను ఛిద్రం చేస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో సంక్షేమ పథకాల అమలు, ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలన్నా పీసా కమిటీ గ్రామ సభలకు ఉన్న సర్వ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తుందన్నారు. బోయ వాల్మీకీలను ఎస్టీ జాబితా చేర్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాన్ని ఆదివాసీలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలి

జి.మాడుగుల: ఏజెన్సీలో కాఫీకి గిరిజన రైతులకు ఐటీడీఏ అధికారులు గిట్టుబాటు ధర కల్పించాలని మండల పీసా కమిటీ అధ్యక్షుడు లోచలి వేణుబాబు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కాఫీ పండ్లను ఐటీడీఏ అధికారులు కిలో రూ.44కు ధరతో కొనుగోలు చేస్తున్నారని, అదే కాఫీ కిలో ప్రైవేట్ వ్యాపారులు రూ.55 నుంచి రూ.58మధ్య ధర చెల్లిస్తున్నారన్నారు. దీంతో గిరిజన కాఫీ రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించటానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ కాఫీ బోర్డు అధికారులు స్పందించి గిరిజన కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన కోరారు. గత ఏడాది కాఫీ తోటలను 70శాతం మందికి వీడింగ్ చేయించి కొత్త మొక్కలు నాటించిన రైతుల్లో కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాలో 30 శాతం మాత్రమే కూలి జమ చేశారని మిగిలిన నగదు జమకాలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాఫీ రైతులుకు బకాయి సొమ్మును జమ చేయాలని ఆయన కోరారు. గిరిజన ప్రాంతంలో రాజ్‌మా చిక్కుళ్ల పంట వర్షాలకు తీవ్ర నష్టం కలిగిందని ప్రభుత్వం, అధికారులు తక్షణమే సర్వే చేసి పంట నష్ట పరిహారం బాధిత రైతులకు అందించాలని ఆయన తెలిపారు.

గిరిజనేతర తాపీమేస్త్రీల పెత్తనం తగదు

ముంచంగిపుట్టు: గిరిజన తాపీ మేస్త్రీలను కించపరిచే విధంగా పలువురు మాట్లాడటం తగదని గిరిజన తాపీమేస్త్రీల సంఘం నాయకులు రవికుమార్, నర్సింగ్, కోమ్ములు, శరత్, ప్రమోద్‌లు అన్నారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన తాపీమేస్త్రీకు పనులు లేకుండా చేస్తూ, మైదాన తాపి మేస్త్రీలు గిరిజన ప్రాంతంలో పెత్తనం చేయడం దారుణమన్నారు. కొంతమంది నేతలు, ఉపాధ్యాయులు గిరిజన తాపీమేస్త్రీలను పోలీసు స్టేషన్‌కు పిలిచి భయ భ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. డిగ్రీలు చదివి ఉద్యోగాలు లేక తాపీమేస్త్రీలుగా పనిచేసుకుంటున్న తమకు మైదాన ప్రాంతాల నుంచి బడా కాంట్రాక్టర్లు, గిరిజనేతర మేస్త్రీలతో వచ్చి తమకు ఉపాధి లేకుండా చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. కొంతమంది నేతలు, ఉపాధ్యాయులు గిరిజన మేస్త్రీలకు మద్దతూ ఇవ్వకుండా మమ్మల్ని భయపెట్టే ప్రయత్నాలు చేయడం తీవ్రంగా బాధిస్తుందని, దీనిపై కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీలకు తమ సంఘం తరఫున ఫిర్యాదు చేస్తామని, తమకు జరిగేలా చేయాలని కోరుతామన్నారు.

గంజాయి రవాణా చట్టరీత్యా నేరం



గొంటువానిపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి తదితరులు

అడ్డతీగల: గంజాయి రవాణా వలలో పడొద్దని అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి అన్నారు. మండలంలోని గొంటువానిపాలెంలో గంజాయి వల్ల కలిగే అనర్థాలపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి క్రయ విక్రయాల్లో భాగస్వాములు కావొద్దన్నారు.అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడానికి పోలీసులకు సహకరించాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఎస్ఐ వినోద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అమ్మవారికి వెండి కిరీటం



వెండి కిరీటాన్ని ఆలయ అర్చకుడుకి అందజేస్తున్న భక్తులు

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరు గ్రామ దేవత మారెమ్మతల్లికి తూర్పుగోదావరి జిల్లా తుని ప్రాంతానికి చెందిన భక్తులు కొరసాల సాయి, వినీల్ జాస్మిన్ దంపతులు వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి మొక్కుగా కిరీటాన్ని అందజేసినట్టు తెలిపారు. స్థానిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు దామోదర శర్మ గురువారం వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారికి వెండి కిరీటాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సాయి, జాస్మిన్ దంపతులకు అభినందనలు తెలిపారు. వారి కుటుంబ సభ్యులు, జెన్కో ఉద్యోగి గణేష్ దంపతులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్త మృతికి సంతాపం



సత్యవతి(ఫైల్)

సీలేరు: జి.కె.వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ కొండజర్త ఆశ కార్యకర్త దర్శంగి సత్యవతి (45) గత కొద్దినెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆమె మృతికి సహచర సిబ్బంది తదితరులు సంతాపం తెలిపారు.

రహదారి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు : లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కె.త్రినాథ్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నా రు. సీపీఎం , వైఎస్సార్‌సీపీ నేతలు నీలకంఠం,సాధురాం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి గ్రామ సమస్యలు



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి: పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ తనూజారాణి ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశానికి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి హాజరయ్యారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. నత్తనడకన జరుగుతున్న గృహ నిర్మాణాలు, పెండింగ్ బిల్లులు తదితర అంశాలను ప్రస్తావించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవతో తాగునీటి సమస్యకు పరిష్కారం



కొర్రలో తాగునీటి బోరుకు మరమ్మతు చేస్తున్న సిబ్బందితో వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయతీ కేంద్రంలో తాగునీటి సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ నాయకులు స్పందించి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపినట్టు గ్రామస్తులు చెప్పారు. గ్రామంలో తాగునీటి బోరు పాడవడంతో గత వారం రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను గుర్తించి వైఎస్సార్‌సీపీ నాయకులు జి.చిరంజీవి, బాలరాజు ప్రత్యేక చొరవ తీసుకొని మండల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. వారు వెంటనే స్పందించారని, సిబ్బంది వచ్చి గ్రామంలో తాగునీటి బోరుకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారన్నారు. దీంతో స్థానికులు వైఎస్సార్‌సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జైపాల్‌సింగ్ సేవలు మరువలేనివి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చింతూరు: ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాడి రాజ్యాంగంలో చేర్పించిన ఆదివాసీ మహాసభ వ్యవస్థాపకుడు జైపాల్‌సింగ్ ముండా జయంతిని గిరిజన గ్రామాల్లో ఘనంగా జరపాలని ఆదివాసీ మహాసభ నాయకులు తెలిపారు. చింతూరులో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను, హక్కులను పొందుపరచడంలో ఆయన విశేష కృషి చేశారన్నారు. ఆదివాసీ మహిళలకు ప్రాతినిధ్యం కోసం నిరసన వ్యక్తం చేశారన్నారు. పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలు మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని విమర్శించారు. చట్టాలు, ఉత్తర్వులను ప్రభుత్వాలు అమలు చేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం పోలవరం నిర్వాసితులకు తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదివాసీ మహాసభ నాయకులు నవీన్‌కుమార్, నరేష్, కళ్యాణ్, లక్ష్మణ్, సత్యవతి, రంగమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గిరిజనులను మోసగిస్తే కఠిన చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు పండిస్తున్న వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లలో వ్యాపారులు మోసాలకు పాల్పడవద్దని సీఐ వరప్రసాద్ అన్నారు. మండలంలో అపరాల వ్యాపారులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వారితో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో కాఫీ, మిరియాలు, అల్లం, పసుపు, రాజ్‌మా తదితర వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్లలో గిరిజన రైతులను వ్యాపారులు తూకాలు, ధరల్లో మోసాలకు పాల్పడుతున్నట్టు తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇటువంటివి భవిష్యత్‌లో చేయవద్దని హితవు పలికారు. వ్యాపారుల వల్ల మోసమైనట్టు గిరిజన రైతులు ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

హుకుంపేట: మండలంలోని గరుడపల్లి విశ్వవాణి ప్రార్థన మందిరం, గుడ గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దైవ సేవకులు జాన్ క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. మాజీ సర్పంచ్ కామేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

వై.రామవరం: స్థానిక లూథరన్ ప్యారిస్ చర్చిలో నక్కాన హూం పర్యవేక్షణలో పాస్టర్ గాబ్రియేల్ , రింగురోడ్డులోని చర్చిలో వ్యవస్థాపకులు బొంకు జార్జి కుటుంబరావు, చవిటిదిబ్బలులో షీలా గీతాంజలి, సి.ఆర్. గొర్లె చిన్నబ్బులు, వెదురునగరం చర్చిలో పాస్టర్ విక్టర్ బాబుల అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.